## అడల్ట్స్ ఓన్లీ కథ



# కాంచనమే...

### పెన్మెత్స శ్రీకాంత్ రాజు

కాంచన!

పేరుకు తగ్గట్టే ఆమె శరీరం బంగారు వర్ణంలో జిగేల్‌మంటూ మెరుస్తూ ఉంటుంది. ఐదూ ఆరంగుళాల పొడవు ఆ పొడవుకు తగ్గ శరీర సౌష్టవం! సెలయేరులా శిరస్సు నుండి నడుము క్రిందవరకూ జాలువారే కేశ సంపద.

చురుకైన కళ్ళు. సంపెంగ రేకలా ముక్కు. కమలా పండు తొనల్లా గులాబి రంగు పెదాలు... ఇలా ఆమె శరీరంలోని ప్రతి పార్ట్సూ ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేసేలా ఉంటాయి.

రెండేళ్ళ క్రితం డిగ్రీ ఫస్టియర్‌లో జాయిన్ అయినప్పుడు కాంచనని మొదటిసారి చూసిన దగ్గర్నుండి ఈ రోజువరకు ఆమెని తల్చుకోగానే నా ఒళ్ళంతా ఒకలాంటి పులకరింత! తనువంతా విస్తరించే తియ్యటి ప్రకంపన.

కాంచన చదువులోనూ ఫస్టే! అన్ని పరీక్షలలోనూ ఆమెకే క్లాసులో అందరికంటే ఎక్కువ మార్కులు వస్తూ ఉంటాయి. ఈ ఆఖరి సంవత్సరం పరీక్షలయిపోతే ఆమెకి యూనివర్సిటీ గోల్డ్‌మెడల్ వచ్చే అవకాశం కూడా ఉందని లెక్చరర్స్ అంటుంటారు.

కేరెక్టర్ పరంగా కూడా కాంచన మచ్చలేని చందమామే! తలవంచుకుని కాలేజీకి వచ్చి లెక్చరర్స్ చెప్పింది నేర్చుకుని తలవంచుకుని వెళ్ళటమే ఆమెకి తెలుసు.

తొలిచూపులోనే కాంచనకి దాసోహమైపోయిన నేను ఎలా అయినా ఆమె ప్రేమ పొంది పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. కానీ మా నాన్న అప్పటికే మినిస్టర్ ముకుందరావుగార్కి మాట ఇచ్చారు నన్ను వాళ్ళ ఇంటల్లుడిని చేస్తానని! ముకుందరావుగార్కి ఓ ప్రధాన రాజకీయ పార్టీలో చాలా గుర్తింపు ఉంది. ప్రస్తుతానికి ఎమ్.ఎల్.ఎ.గా ఉన్న మా నాన్న రాజకీయ జీవితానికి ముకుందరావుగారితో సంబంధం కలుపుకోవడం ఎంతైనా అవసరం.

మా నాన్న కోసం నా ప్రేమని మనసులోనే అణిచిపెట్టేసాను. అయినా కాంచన చాలా స్థిరమైన వ్యక్తిత్వంగల దానిలా అన్పిస్తుంది. ప్రేమా, దోమాలాంటి కబుర్లకి పడిపోయే మామూలు ఆడపిల్ల కాదు ఆమె.

కాంచన స్నేహితురాళ్ళ ద్వారా నాకు తెలిసిందేమిటంటే ఆమె పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు అప్పటికే చాలా సంవత్సరాల నుండి ప్రిపేరవుతోందని.. చదువులో ఆమె పట్టుదల అనితరసాధ్యమైనదని! దాంతో నాకు ఆమె అందంపై మోహం తోపాటూ ఆమె వ్యక్తిత్వంపై గౌరవం కూడా పెరిగింది. నాకు కారు, బైక్ రెండూ ఉన్నాయి. స్నేహితు

లతో మందు కొట్టడం, పబ్‌లకెళ్ళటం నాకు అల వాటే. నాలుగు కోట్ల రూపాయల ఆస్తులున్న ఎమ్.ఎల్.ఎ. కొడుకుగా నా సర్కిల్లో డబ్బున్న స్నేహితులు చాలామందే ఉన్నారు. వాళ్ళందరికి మందూ మగువా కొత్తేం కాదు. మందు వరకూ అప్పుడప్పుడూ వెళుతున్నా నేను మగువ వరకూ వెళ్ళలేదు. ఎందుకంటే నా దృష్టిలో ప్రేమో, మోహమో ఏదో ఒకటైనా లేకుండా జరిగే సంగమం సారవిహీనమైనది! అందుకే నేనింకా బ్రహ్మచారినే!

ప్రతీరోజూ కర్టెక్ట్‌గా పావుతక్కువ పది గంటలకు కాంచన బస్ దిగుతుంది. ఆ టైమ్‌కి ఠంచనుగా నేనక్కడ ఉంటాను. నా బైక్‌ని నా ఫ్రెండ్స్ ఎవరో ఒకరికిచ్చేసి ఆమె వెనకే నడుస్తూ కాలేజ్‌కి వస్తాను.

ఒద్దిగ్గా కలహంసలా ఆమె నడుస్తుంటే రిథమిక్‌గా కదిలే ఆమె నిడువైన జడ చెప్పుల్లో ఇమిడిపోయిన పండిన తమలపాకుల్లాంటి పాదాలు చిన్నగా చప్పుడు చేసే పదమంజీరాలు.. అలా నా చూపులు ఆమెని శోధిస్తొంటే.. ఆమె అడుగులో అడుగేస్తుంటే అర కిలోమీటరు దూరం అర నిమిషంలో నడిచేసినట్టన్పిస్తుంది.

ఇన్ని రోజులుగా నేనామెని వెంబడిస్తున్నా ఆమె ఒక్కసారి కూడా నా వైపు చూడలేదు. మాట్లాడలేదు. మాట్లాడటానికి నేను చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. ఆమె చిరు చిర్నవ్వుకు కూడా నేనింత వరకూ నోచుకోలేదు.

ఈ మధ్యనే నాకో ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది కాంచన గురించి. అది.. ఆమె ఓ అనాథ! సిటీకి కొంచెం దూరంగా ఉన్న ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న అనాధ ఆశ్రమంలోనే ఆమె పెరిగిందట. ఇప్పటికీ అదే ఆశ్రమం నుండి రోజూ కాలేజ్‌కి వస్తోందట. ఈ సంగతి వినగానే గుండెలు బరువెక్కాయి. ఇంత అపురూప లావణ్యరాశికి, మేధావికి, సుగుణశీలకు దూరమైన ఆ తల్లిదండ్రులెవరో చాలా దురదృష్టవంతులు!

★ ★ ★

ఐదారు రోజులుగా కాంచన కాలేజ్‌కు రావటం లేదు. ఆమె గత కొన్ని సంవత్సరాలుగా ఇలా చేసింది లేదు. తనని చూడక నాకు పిచ్చెక్కిపోతోంది. ఏమీ తోచటం లేదు. ఏ రోజుకారోజు రేపు వచ్చేస్తుందిలే అనుకోవటం... తను రాకపోవడం... నేను తనని ప్రేమిస్తున్నానో?! కామిస్తున్నానో?!.. స్నేహితురాలిగా భావిస్తున్నానో.. నాకే అర్థం కావటం లేదు. ఏది ఏమైనా రేపు తను రాకపోతే కాలేజ్ నుండి అడ్రస్ తీసుకుని ఆమె ఉండే ఆశ్రమానికి వెళ్ళి రావాలని నిర్ణయించుకున్నాను.

కానీ ఆ మర్నాడే ఆమె వచ్చేసింది. కొంచెం చిక్కింది. కళ్ళ కింద నల్లటి వలయాలు. బహుశా జ్వరపడిందేమో?

ఆమె యథాప్రకారం కాలేజ్‌కి వచ్చేయటం నా మనసుకి చెప్పలేనంత స్వాంతననిచ్చింది.

★ ★ ★

ఆ రోజు ఉదయం తెల్లవారుఝాము నుండి వర్షం కుండపోతగా కురుస్తోంది. నేను హేట్, జర్కిన్ వేసుకుని యథాప్రకారం బస్ స్టాప్‌లో నిలుచున్నాను కాంచనకోసం.

కొన్ని క్షణాల నిరీక్షణానంతరం పింక్ కలర్ చుడిదార్ ధరించి అప్సర కన్యలా బస్‌లోంచి దిగింది కాంచన. ప్రతిరోజులా ఆమె పక్కన క్లాస్‌మేట్స్ ఎవరూ లేరు. నా పక్కన కూడా ఎవరూ లేరు. వర్షం కారణంగా చాలామంది కాలేజ్ ఎగ్గొట్టేసినట్టున్నారు. ఎప్పటిలా ఆమె అడుగులో అడుగేస్తూ వర్షంలో తడుస్తున్న ఆమె అందాల్ని కళ్ళతోనే ఆస్వాదిస్తున్నాను.

''అభినయ్..''

అక్కడున్నది నేనూ కాంచన మాత్రమే... మరి ఈ పిలుపెక్కడిది... అవును కాంచన!.. కాంచనే నన్ను పిలిచింది. ఇన్ని సంవత్సరాల తర్వాత మొదటిసారిగా ఆమె నా పేరును ఉచ్ఛరించింది. ఒక్కసారిగా సంతోషం నా మనసుని కుదిపేసింది.

''నువ్వు... నన్ను?!..'' అడిగేను ఆనందంతో ఉబ్బితబ్బిబవుతూ.

''అవును.. నేనే నిన్ను పిలిచాను'' వీణ మ్రోగినట్టుందా గొంతు.

''అక్కడ కూర్చుందామా?'' దారి పక్కనున్న బస్ షెల్టర్‌ని చూపించింది. వర్షం వలన ఎవరూ లేరు అందులో.

''పద'' అన్నాను.

ఇద్దరం కూర్చున్నాం.

ఆమె శరీరం మీది నుండి వీస్తున్న నులివెచ్చటి గాలి నన్ను వివశుడ్ని చేస్తోంది. నా శరీరం ప్రకంపిస్తోంది. చలికో లేక నెచ్చెలి సాన్నిహిత్యానికో అర్థం కావటం లేదు.

''అభినయ్... సూటిగా అడుగుతున్నాను. ఇన్ని వారాలు, నెలలు నేను కనీసం నీ వైపు కన్నెత్తి చూడకపోయినా ఇలా ప్రతిరోజూ నా వెంట ఎందుకు పడుతున్నావు?''

ఊహించని ఈ ప్రశ్నకి బిత్తరపోయాను నేను.

''అంతలా నచ్చేనా నేను?''

తలూపేను నోట మాట రాక.

''ఆ నచ్చటం.. పెళ్లి చేసుకునేలాంటిదా? లేక పొందుకోరే లాంటిదా?''

ఉలిక్కిపడ్డాను.



## తనుశ్రీ విచారం

ఇటీవల న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా ముంబాయిలో ఇద్దరమ్మాయిలకి జరిగిన అన్యాయం గురించి కామెంట్ చేస్తూ తనుశ్రీ దత్తా- 'అసలు మగాళ్లు తాము ఎలా పుట్టిందీ మరిచిపోతున్నారు. తమకు జన్మను ఇచ్చిన స్త్రీలను ఎలా గౌరవించాలో కూడా తెలుసుకోవడం లేదీ మగాళ్లు' అంటూ తెగ వాపోయింది.

కాంచన నవ్వింది. ''భయపడకు పెళ్ళి చేసుకోనక్కర్లేదు'' ఒక్క నిమిషం ఆగి కంటిన్యూ చేసింది.. ''నువ్వు కోటీశ్వరుల బిడ్డవని విన్నాను. నాపై మోజుతో ఉన్నావని తెలుసు. నా ప్రవర్తనతో అందరి మదిలోనూ గౌరవప్రదమైన స్థానాన్ని దక్కించుకున్నానని తెలుసు. ఇప్పుడు నేను మాట్లాడటం పూర్తి చేస్తే నీకు నాపై ఉన్న గౌరవం పడిపోతుందని తెలుసు. కాని ఇంతకు మించి నాకు మరో దారి లేదు'' ఆమె గొంతు వణికింది, చల్లగా లికనుకుంటా.

''నాకు మూడు లక్షలు కావాలి. ఆ డబ్బు నువ్వు సర్దగలిగితే నీతో రెండ్రోజులు నేను గడుపుతాను''ఎక్కడో ఉరిమింది. అయోమయంగా ఆమె వైపు చూసాను. ఆమె తలవంచుకుని ఉంది. ముఖంలోని భావాలు నాక్కనిపించలేదు.

నేను విన్నది నిజమేనా? కాంచన.. ఇలా?! ఏమిటిదంతా?!

మూడు లక్షలు ఏర్పాటు చేయడం నాకు పెద్ద కష్టం కాదు. ఆమె సహాయం చేయమన్నా చేసుండేవాడినే. అందుకు ప్రతిగా ఆమె నాతో గడుపుతాననడం నా ఊహకి అందని విషయం.

అదే మాట కాంచనతో అన్నాను-

''వద్దు... నేను నీ సహాయం ఉచితంగా పొందలేను. అప్పుగా కూడా నాకొద్దు, తిరిగి తీర్చలేను కాబట్టి, నా ప్రపోజల్ నచ్చితే ప్రొసీడవుదాం.. లేకపోతే లేదు''

''సరే..'' వెంటవే ఒప్పేసుకున్నాను, మరో ఆలోచనకి తావివ్వకుండా.

★ ★ ★

నిన్ననే కాంచన అడిగిన మూడు లక్షల రూపాయలు ఆమెకి అందజేసాను. ఈ రోజు సాయంత్రం ఫ్లయిట్‌కి ఇద్దరమూ బయల్దేరి ముంబాయి వచ్చేం. అరేబియా సముద్రానికి అభిముఖంగా ఉన్న ఓ ఖరీదైన హోటల్‌లో సూట్ బుక్ చేసాను.

కొద్దిసేపటి క్రితమే నేను తలస్నానం చేసి రిఫ్రెష్ అయి క్యాజువల్స్ వేసుకున్నాను. కాంచన బాత్‌రూంలో స్నానం చేస్తోంది.

కిటికీలో నుండి చూస్తుంటే సముద్రం చిత్రంగా ఉంది. ఇప్పటి నా పరిస్థితిలా...

ఉన్నట్టుండి వెచ్చటి పరిమళం నన్ను చుట్టుముట్టింది. ఆ వెంటనే మల్లెచెండుల్లాంటి చేతులు వెనుక నుండి నన్ను వాటేసుకున్నాయి.

వీపు మీద పూలగుత్తితో సుతిమెత్తగా ఒత్తుతున్న ఫీలింగ్.. ఆ బాధకి ఒళ్ళంతా తియ్యటి తీపులు.. ప్రెషర్ కుక్కర్‌లోంచి వస్తున్న ఆవిరంత వేడిగా నిట్టూర్పులు.

నా మెడ వంపులో ఆమె మోము సేదతీరుతోంది. నా నడుము మీదున్న ఆమె చేతులు మెల్లగా టీ షర్టు క్రింద నుండి పొట్టపైకి చేరి అక్కడ్నుంచి నా ఛాతి మీదకి ప్రాకి.. అటూ ఇటూ కదులుతూ... గమకాలు పలికించసాగాయి.

తటాలున వెనక్కి తిరిగి కొండని ఢీ కొట్టే కెరటంలా ఆమెని చుట్టేసాను. ఇన్నాళ్ళు అందని ద్రాక్షలా ఊరించిన ఆమె అందాలన్నీ ఇప్పుడు అందుబాటులోకొచ్చేసాయి. నాలో కలవరం రేపే ఆ కళ్ళకు.. రెచ్చగొట్టే పెదవులకు.. కవ్వించే నడుముకు అన్నింటికి నా వేడి వేడి పెదవుల్తో వాతలేసి బుద్ధి చెప్పసాగేను. కాలం కర్పూరమైపోసాగింది.

తారాజువ్వలు పేలినట్టు మెదడులో మెరుపులు.. తనువంతా మైమరపులు.. అనిర్వచనీయమైన అనుభూతులతో రెండ్రోజులు రెండు క్షణాల్లా కరిగిపోయాయి. బొంబాయి నుండి తిరిగి వచ్చేక ఎయిర్‌పోర్టులో ఆమె ఆటో ఎక్కి వెళ్ళిపోతుంటే.. నా శరీరంలో ఏదో భాగం మిస్సయిపోతున్నంత బాధగా అన్పించింది.

★ ★ ★

రెండ్రోజులు తర్వాత నా స్నేహితుల ద్వారా ఓ విషయం వినగానే పక్కన బాంబుపడ్డట్టు అదిరిపోయాను. అది... కాంచన విజయ్ దగ్గర లక్ష రూపాయలు తీసుకుని అతనితో ఊటీ వెళ్లిందని! విజయ్ మా క్లాస్‌మేట్.. వాళ్ళ నాన్న పేరున్న కాంట్రాక్టరు.

నా బ్రెయిన్ తెల్లకాగితంలా అయిపోయింది. ఏమిటిది? ఏదో పెద్ద అవసరం ఉండి, తప్పక నాతో గడిపింది అనుకున్నాను. కానీ రెండ్రోజులు తిరగకుండా మరొకడితో.. ఛీ.. ఛీ.. అన్పించింది.

అయినా తల్లీతండ్రీలేని అనాధ! పట్టించుకునే నాధుడెవడు? ఈజీ మనీ అలవాటైపోయి ఉంటుంది. ఇంతటి అల్పురాలని నేనెంత గొప్పగా ఊహించుకున్నాను? మనసంతా చేదుగా అయిపోయింది. ఎంత వద్దనుకున్నా.. కాంచన తాలూకు ఆలోచనలే.

విజయ్‌తో తిరిగి వచ్చిన తర్వాత కుమార్‌తో.. అతని తర్వాత ఆదిత్యతో... ఇలా బాగా డబ్బున్న కుర్రాళ్ళందరూ ఒకరి తర్వాత ఒకరు. ఆ లిస్ట్ రెండు నెలలు తిరిగేసరికి చాలా అయింది.

కాలేజ్ బాత్‌రూముల్లో ఆమె సెల్‌ఫోన్ నెంబరు! ఆమె అంగాంగ వర్ణనలు. లెక్చరర్స్‌తో సహా అందరూ ఆమెని చులకన చేసి మాట్లాడుతుంటే మనసు బాధగా మూల్గేది. రోజులు గడిచే కొద్దీ నా జ్ఞాపకాలలోంచి కాంచన క్రమక్రమంగా అదృశ్యమైంది. డిగ్రీ పూర్తవ్వడంతో మా నాన్నతో రాజకీయాల్లో తిరగసాగేను.

★ ★ ★

ఆ వేళ గాంధీ జయంతి.

మా నాన్నతో కలిసి పళ్ళు పంచటానికి ఓ అనాధ ఆశ్రమానికి వెళ్ళేను. ఆ పిల్లలకు పళ్ళు పంచి తిరిగొచ్చేస్తున్నప్పుడు చూసాను.. ఆ చిన్న కాంస్య విగ్రహాన్ని! ఆ ముఖం ఎక్కడో చూసినట్టు అన్పిస్తోంది. దగ్గరకెళ్లి పరీక్షగా పరికించాను.

కాంచన! ఆ విగ్రహం కాంచనదే! ఆ విగ్రహం క్రిందున్న రాతి పలకవైపు దృష్టి సారించేను. 'తేజోమయి కాంచన' అని ఉంది. అంటే... కాంచన చనిపోయిందా? ఎలా? ఒక్క అంగలో ఆశ్రమ నిర్వాహకురాలి గదికి చేరాను.

''కాంచన.. కాంచన ఈ ఆశ్రమంలో...'' అడిగేను నేను.

''అవును ఈ ఆశ్రమంలోనే పెరిగింది. కొన్ని నెలల క్రితం కేన్సర్‌తో చనిపోయింది''

గుండెలో మంచు పేరుకుంటున్న భావన.

''నాకు కాంచన గురించి డిటైల్స్ చెప్పండి. ఆమె నా క్లాస్‌మేట్'' దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ అన్నాను.

''కాంచన నెలల పిల్లగా ఈ ఆశ్రమానికి వచ్చింది. ఇక్కడే పెరిగింది. తను జీవితంలో చాలా ఉన్నత స్థితికి చేరుకుంటుందని అందరం ఆశించాం. పదిమంది సంతోషాన్ని కోరే అరుదైన వ్యక్తిత్వం ఆమెది. కానీ కాన్సర్ కబళించేసింది. ఈ అనాధ శరణాలయం ఫండ్స్ లేక మూతపడే పరిస్థితి వచ్చింది. శరణాలయ భవనం కూడా శిధిలావస్థకు చేరింది. అలాంటి సమయంలో ఎలా సమకూర్చిందో తెలియదు కానీ కాంచన రెండు లక్షలు ఖర్చుపెట్టి భవనాన్ని బాగు చేయించింది. ఎనిమిది లక్షలు బ్యాంకులో వేసి ఆ వడ్డీతో ఈ అనాధ పిల్లల భోజన వసతికి ఏర్పాట్లు చేసింది. ఈ రోజు ఈ అనాధలందరూ వీధిన పడకుండా ఈ శరణాలయం కొనసాగుతున్నదంటే అందుకు కారణం కాంచనే'' పవిట చెంగు తీసుకుని కళ్ళొత్తుకుందావిడ.

వింటున్న నాకు ఒక్కొక్క పొరా విడిపోతున్నట్టు అన్పించసాగింది. భవిష్యత్తుపై బంగారు కలలు కంటూ శ్రద్ధగా చదువుకుంటున్న అనాధ అయిన కాంచనని...క్యాన్సర్ సర్పం కాటేస్తే మట్టిలో కలిసిపోబోయే తన శరీరాన్ని పణంగా పెట్టి తన తోటివారి జీవితాల్లో వెలుగునింపడానికి ఆరాటపడింది.

''ఇంతకు మించి నాకు మరో దారిలేదు'' ఆనాటి కాంచన మాటలు గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. ఆ మహోన్నత మానవతామూర్తిని అందరిలానే నేనూ అపార్థం చేసుకున్నాను.

కాంజన విగ్రహం దగ్గరకు నడిచేను. అక్కడే కుండీలో మొక్కకు పూసిన ఓ అందమైన గులాబీని కోసి ఆమె విగ్రహం ముందుంచి రెణ్ణిమిషాలు కళ్ళు మూసుకున్నాను.

'కాంచన ఎప్పటికీ కాంచనమే' అనుకుంటూ బరువెక్కిన గుండెతో వెనుదిరిగేను.

☆